యాదగిరిగుట్టలో భక్తుల కిటకిట

యాదగిరిగుట్ట, నవంబర్ 24 : యాదగిరీశుడి దివ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం వారాంతపు సెలవుతోపాటు కార్తిక మాసం కావడంతో స్వయంభూ నారసింహుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాడవీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, తిరు మాఢవీధులు, గర్భాలయ ముఖ మండపం భక్తులతో సందడిగా మారాయి. భక్తులు కొండ కింద కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి లక్ష్మీ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ప్రసాద విక్రయశాలలో స్వామివారి ప్రసాదాన్ని కొనుగోలు చేశారు. స్వామివారి ధర్మ దర్శానికి 4 గంటలు, వీఐపీ దర్శనానికి 2గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు జరిగే సువర్ణపుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బంగారు పుష్పాలతో ఉత్సవమూర్తిని అర్చించారు. స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవను నిర్వహించారు. తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం సుదర్శన నారసింహ హోమం ఘనంగా జరిపారు. సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. అనంతరం మొదటి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. సాయంత్రం వెండి మొక్కు జోడు సేవ, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు తిరువాధన, సహస్రనామార్చన, శయనోత్సవ సేవను అత్యంత వైభవంగా జరిపారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా వ్రత మండపంలో సత్యనారాయణస్వామి సామూహిక వ్రత పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దీపారాధనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. స్వామివారిని 49వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.79,70,843 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

యాదగిరిగుట్ట మాఢ వీధుల్లో భక్తుల సందడి

స్వర్ణగిరిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

కుటుంబ సభ్యులతో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేస్తున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి కృపాసాగర్

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 24 : పట్టణ పరిధిలోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి కృపాసాగర్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికి ఆశీర్వచనాలు, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన

లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్తులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 24 : కార్తిక మాసం పురస్కరించుకొని పట్టణ శివారులోని మాసుకుంట ఆంజనేయ సహిత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం లక్ష బిల్వ పుష్పార్చన నిర్వహించారు. ఉదయం మహా గణపతి పూజ, స్వస్తీ వాచనంతో కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం శివయ్యకు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారులు సిద్ధేశ్వర్, కృష్ణ పండ, రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో చేపట్టిన లక్ష బిల్వ పుష్పార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గడ్డం వెంకటయ్య కుమారుల ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జడల అమరేందర్‌గౌడ్, కోశాధికారి చింత రాజు, సభ్యులు నీల కృష్ణ, గడ్డం నరేందర్, భక్తులు పాల్గొన్నారు.

'ఆధ్యాత్మిక చింతనతో సన్మార్గంలో పయనించవచ్చు'

ప్రవచనాలు వినిపిస్తున్న సంపూర్ణానంద గిరిస్వామి, ప్రకాశానంద సరస్వతిస్వామి

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 24 : ఆధ్యాత్మిక చింతనతోనే సన్మార్గంలో పయనించవచ్చని లలితాంబిక సుపీఠం సంస్థాపకులు సంపూర్ణానందగిరిస్వామి, కృష్ణా జిల్లా పెనమలూరు జ్ఞాన సరస్వతి పీఠం ప్రకాశానంద సరస్వతిస్వామి అన్నారు. పట్టణంలోని మార్కండేశ్వర స్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక భక్త సమాజం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మజ్ఞాన సదస్సులో వారు మాట్లాడారు. సకల జీవరాశుల్లో మానవ జన్మ ఉదాత్తమైనదన్నారు. అన్ని అనర్థాలకు కారణం ఆత్మజ్ఞానం లేకపోవడం వల్లేనని పేర్కొన్నారు. జ్ఞానం అనేది కులం, దేశం, ప్రాంతానికి పరిమితం కాదని, ప్రతి ఒక్కరూ భక్తి భావాలను అలవరుచుకోవాలని సూచించారు. అనంతరం భక్తులు స్వామీజీలను సత్కరించి పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక భక్త సమాజం అధ్యక్షుడు భారత పురుషోత్తం, గౌరవాధ్యక్షుడు కటకం తుకారాం, ఉపాధ్యక్షుడు చక్రాల నరసింహ, ప్రధాన కార్యదర్శి నోముల అశోక్, సహాయ కార్యదర్శి సుంకి వెంకటేశం, కోశాధికారి పుప్పాల నాగేశ్వర్, కన్వీనర్ సీత సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం : దేశిడి ప్రభావతి

మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న శాఖాహారులు

సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 24 : నిత్యం ధ్యానం చేయడం వల్ల ఆరోగ్యం మెరుగవుతుందని, మానసిక ప్రశాంతత పెరుగుతుందని శ్రీమాన్ నారాయణ పిరమిడ్ ధ్యాన మందిరం వ్యవస్థాపకురాలు దేశిడి ప్రభావతి అన్నారు. పిరమిడ్ వార్షికోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి పిరమిడ్‌లో ధ్యానం చేస్తే శరీరంలోని రెండు లక్షల 72వేల నాడులు శుద్ధి అవుతాయన్నారు. మాంసం తినడం వల్ల 159 రోగాలు వస్తాయని, అందుకే ప్రతిఒక్కరూ శాఖాహారులుగా మారాలని సూచించారు. దేశిడి నరేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, సతీశ్, కిరణ్‌కుమార్, పాండు, బాలరాజు పాల్గొన్నారు.

త్రిలింగేశ్వర ఆలయ చైర్మన్‌గా ర్యాకల శ్రీనివాస్

ర్యాకల శ్రీనివాస్

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 24 : మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో స్వయంభువుగా వెలిసిన త్రిలింగేశ్వరస్వామి ఆలయ నూతన చైర్మన్‌గా బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆదివారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఓరుగంటి నాగయ్యగౌడ్, బొమ్మారపు సురేశ్, ఉపాధ్యక్షులుగా ఓరుగంటి వేణుగౌడ్, పండుగ కిరణ్, బొమ్మారపు బాలరాజు, ఓరుగంటి అఖిల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఓరుగంటి రమేశ్‌గౌడ్, కోశాధికారులుగా రాంపల్లి అరుణ్, గంజి సందీప్, సహాయ కార్యదర్శులుగా ఓరుగంటి సుధీర్ గౌడ్, రాంపల్లి అనిల్, సలహాదారులుగా ఓరుగంటి కృష్ణ, రాంపల్లి అజయ్, బింగి పాండు, రాంపల్లి నాగరాజు, గుండ్లపల్లి భరత్, ఓరుగంటి సాయి, కొంపల్లి ప్రసాద్ ఎన్నికయ్యారు.

ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద ధర్నా

సమావేశంలో మాట్లాడుతున్న మేక అశోక్‌రెడ్డి

రామన్నపేట, నవంబర్ 24 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెల్లెల పెంటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగె సోములు కోరారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఆయా సంఘాల ఉమ్మడి సమావేశంలో వారు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ నూతన చట్టాలను తీసుకొస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికులు సమరశంఖం పూరించాలని పిలుపునిచ్చారు.

'సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి'

యాదగిరిగుట్ట, నవంబర్ 24 : చౌటుప్పల్‌లో డిసెంబర్‌లో నిర్వహించే సీపీఎం 3వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంగ నర్సింహులు కోరారు. మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో ఆదివారం ఇంటింటికి సీపీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలన్నారు. రైతుభరోసా అందక, పంటలకు గిట్టుబాటు ధర రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్వాపూర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన రైతులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి, నాయకులు భీమగాని రాములు, స్వామి, వెంకటేశ్, కిష్టయ్య, నరేశ్, శంకరయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఆలేరు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

మణి

పార్థసారథి

ఆలేరు టౌన్, నవంబర్ 24 : 68వ ఎస్జీఎఫ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి హాకీ అండర్-14 బాలుర విభాగంలో ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రాజబోయిన మణి, శనిగరం పార్థసారథి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 28నుంచి డిసెంబర్ 1వరకు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ పూల నాగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దాసరి మంజుల, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

సర్వేలో నమోదు చేయించుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 24 : మున్సిపాలిటీ పరిధిలో 13 వార్డుల్లో ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్నామని, అందుబాటులో లేకుండా సర్వేలో నమోదు చేసుకోలేనివారు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. సర్వేలో నమోదు చేసుకోలేనివారు సంబంధిత ఏరియా ఎన్యూమరేటర్‌ను పంపించి నమోదు చేయిస్తామని తెలిపారు. ఈ నెల 26న సాయంత్రం 4గంటల్లోపు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు ఆదిత్య (సీనియర్ అసిస్టెంట్) 9553558989, చిరంజీవి 8143322152 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ యూత్ కార్యదర్శిగా ప్రశాంత్

ఆలేరు రూరల్, నవంబర్ 24 : మండలంలోని కొలనుపాక గ్రామానికి చెందిన మామిడాల ప్రశాంత్ యునైటెడ్ కింగ్‌డమ్ (లండన్) బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ విభాగానికి యూత్ కార్యదర్శిగా ఆదివారం నియమితులయ్యారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచన మేరకు నియామకం జరిగింది. ప్రశాంత్‌ను మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్ అభినందించారు.

దివ్య జీవన సంఘం పట్టణ అధ్యక్షుడిగా కృష్ణ

యాదగిరిగుట్ట, నవంబర్ 24 : శివానంద ఆశ్రమం అనుబంధ సంస్థ అయిన దివ్య జీవన సంఘం పట్టణ నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని బుచ్చిదాస్ ఆశ్రమంలో ఆదివారం ఎన్నుకున్నారు. విశాఖపట్నానికి చెందిన విష్ణుదేవానంద సరస్వతి ఆధ్వర్యంలో తాత్కాలిక కమిటీ అధ్యక్షుడిగా బత్తిని కృష్ణ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా తోట సత్యం, కోశాధికారిగా చెడదీపు సత్యనారాయణతోపాటు 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

'రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణ'

దండు మల్కాపురంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 24 : రాజకీయ లబ్ధి కోసం కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎస్సీలను వర్గీకరించాయని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల లింగస్వామి అన్నారు. మండలంలోని దండు మల్కాపురం, ధర్మోజిగూడెం, కైతాపురం గ్రామాల్లో మాల సింహగర్జన పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించి సభ విజయవంతానికి ప్రచారం నిర్వహించారు. దామాషా ప్రకారం రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు యనమల నాగరాజు, తగరం వెంకటేశం, మంత్రి యాదయ్య, వల్లబోతు భాస్కర్ పాల్గొన్నారు.

'సింహగర్జనను విజయవంతం చేయాలి'

మోత్కూరు, నవంబర్ 24 : హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించనున్న మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మాల మహానాడు అధికార ప్రతినిధి బోడ బాబురావు కోరారు. మండలంలోని దాచారం, అడ్డగూడూరులో ఆదివారం మాలల సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బుంగ లక్ష్మయ్య, గోలి భిక్షం, కామిండ్ల నర్సయ్య, మల్లయ్య, నరేందర్, యేసయ్య, లింగయ్య, రవి, భిక్షమయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

యాదవులు ఐక్యతతో రాజకీయ శక్తిగా ఎదుగాలి

- సదర్ సమ్మేళనంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

సదర్ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, వేదికపై ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, బీఆర్‌ఎస్ నాయకుడు క్యామ మల్లేశ్ తదితరులు

రామన్నపేట, నవంబర్ 24 : గొల్ల, కుర్మలు ఐక్యతతో రాజకీయ శక్తిగా ఎదుగాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. అఖిల భారత యాదవ మహాసభ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం రాత్రి సదర్ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లకురుమల ఆత్మీయ ప్రతీక అయిన సదర్ సమ్మేళనాన్ని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించి రూ.150కోట్లు కేటాయించిందన్నారు. యాదవులు చైతన్యవంతులై విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ పాడి పశువులను పూజించే సంస్కృతి యాదవులదన్నారు. మండల కేంద్రంలో యాదవ సంఘం భవనానికి రూ.10లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ పశువులను పూజించి పాడి సంపదను పెంచే జాతి మనదన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు మాట్లాడుతూ మన ఓట్లను మనం వేసుకుంటే రాజ్యాధికారం వస్తుందన్నారు. యాచించే స్థాయి నుంచి కొట్లాడి సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అంతకుముందు బొడ్రాయికి బోనం సమర్పించి దున్నపోతుల ఊరేగింపు నిర్వహించారు. యాదవ మహాసభ మండలాధ్యక్షుడు తిరుగుడు మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో నాయకులు కాసం వెంకటేశ్వర్లు, లొడంగి గోవర్ధన్, ముక్కాముల దుర్గయ్య, సుక్కల సత్యం, కడారి స్వామి యాదవ్, నీల ఐలయ్య, కల్లూరి నాగేశ్, సింగనబోయిన జంగయ్య పాల్గొన్నారు.

మోత్కూరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా విమల

విమల (చైర్‌పర్సన్)

నర్సిరెడ్డి (వైస్ చైర్మన్)

మోత్కూరు, నవంబర్ 24 : మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ సెక్రటరీ ఎం.రఘునందన్‌రావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. చైర్‌పర్సన్‌గా గుండాల మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన నూనెముంతల విమలావెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌గా అడ్డగూడూరు మండలం దొంగల రాపాకకు చెందిన లింగాల నర్సిరెడ్డి నియమితులయ్యారు. డైరెక్టర్లుగా గూడెపు కుమార్, పాశం వినోద, పోచం జగన్నాథం, బొడిగె నర్సింహ, మహ్మద్ ఖాజా సమీరొద్దీన్, వనం బాలకృష్ణ, బాలెంల విద్యాసాగర్, కొంపెల్లి లలిత, పన్నాల శ్రీనివాస్ రెడ్డి, చిత్తలూరి సోమయ్య, సోమ వెంకటేశ్వర్లు, బుస్సు రవిని నియామకం చేశారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

మహిళా సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి అనూరాధ

రామన్నపేట, నవంబర్ 24 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి మహిళల సమస్యలను పరిష్కరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనూరాధ డిమాండ్ చేశారు. మండలంలోని మునిపంపుల గ్రామంలో ఆదివారం జరిగిన మహిళా సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలకు గృహలక్ష్మి పథకం కింద రూ.2,500, రేషన్ కార్డులు, ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా విస్మరించిందన్నారు. అనంతరం ఐద్వా గ్రామ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా యాదాసు శారద, కార్యదర్శిగా తాళ్లపల్లి హేమలత, ఉపాధ్యక్షులుగా బొడ్డుపల్లి సంధ్య, బూడిద లక్ష్మి, ఉండ్రాతి పూలమ్మ, సహాయ కార్యదర్శులుగా రిజ్వానా, గంటెపాక లక్ష్మి, జోగుల ఉమ ఎన్నికయ్యారు.

క్రమశిక్షణకు మారు పేరు ఎన్‌సీసీ విద్యార్థులు

ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

ఆలేరు టౌన్, నవంబర్ 24 : క్రమశిక్షణకు మారు పేరు ఎన్‌సీసీ విద్యార్థులని ప్రధానోపాధ్యాయురాలు దాసరి మంజుల అన్నారు. ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలేరులో ఆదివారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేశ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ సర్టిఫికెట్ విద్యార్థులకు భవిష్యత్‌లో చదువులు, ఉద్యోగాల కోసం ఉపయోగపడుతాయన్నారు. ఎన్‌సీసీ ద్వారా దేశ రక్షణ శాఖలో శిక్షణ సులభతరం అవుతుందని చెప్పారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డిపల్లి సైదులు, పసుపులేటి నరేంద్ర స్వామి. పంగ మేఘరాజు, స్వర్ణలత, హేమలత, జ్ఞాన ప్రసూన, రాధిక, రోహిణి, సత్యనారాయణ, మల్లేశం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వానం

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు శుభలేఖ అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ గోపాల్‌గౌడ్, చిత్రంలో జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, నాయకులు

రాజాపేట, నవంబర్ 24 : హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రాజాపేట మాజీ జడ్పీటీసీ చామకూర గోపాల్‌గౌడ్ ఆదివారం కలిసి తన కూతురు వివాహానికి రావాలని శుభలేఖ అందించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, మదర్ డైయిరీ మాజీ డైరెక్టర్ చింతలపూరి వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణ ఉన్నారు.

శ్రీకాంతాచారి వర్ధంతికి రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఎమ్మెల్యే సామేల్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న కాసోజు శంకరమ్మ

మోత్కూరు, నవంబర్ 24 : మండలంలోని పొడిచేడు గ్రామంలో డిసెంబర్ 3న నిర్వహించనున్న మలిదశ తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి 15వ వర్ధంతి సభకు రావాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే సామేల్‌ను ఆదివారం శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, సోదరుడు రవీంద్రాచారి కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వార్డెన్ భిక్షం

ఆత్మకూరు(ఎం), నవంబర్ 24 : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన దుప్పట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డెన్ రెమిడాల భిక్షం మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో వసతి పొందుతున్న విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదుగాలని సూచించారు.

అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

టంగుటూరులో ఐలిమల్లయ్య స్థూపం ఆవిష్కరణ

ఐలిమల్లయ్య స్థూపాన్ని ఆవిష్కరించి జోహార్లు అర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

ఆత్మకూరు(ఎం), నవంబర్ 24 : మండలంలోని టంగుటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సీపీఎం గ్రామ మాజీ కార్యదర్శి జూకంటి ఐలి మల్లయ్య స్థూపాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థూపం వద్ద నివాళి అర్పించి మాట్లాడారు. ఎందరో వీరులను గన్న పోరాటాల గడ్డ టంగుటూరు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టి ఎర్ర జెండా నాయకత్వంలోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మాటూరి బాలరాజు, కురాకుల మల్లికార్జున్, దూపటి వెంకటేశ్, సుదగాని సత్యరాజయ్య, నల్లమాస తులసయ్య పాల్గొన్నారు.

పోచంపల్లిలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

దరఖాస్తులు స్వీకరిస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్లు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 24 : పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన వారి నుంచి ఓటు హక్కు కోసం దరఖాస్తులను స్వీకరించారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ సౌజన్య, బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

'సీపీఎం జిల్లా మహాసభలకు విరాళాలు ఇవ్వండి'

ఆత్మకూరు(ఎం), నవంబర్ 24 : చౌటుప్పల్‌లో డిసెంబర్ 15నుంచి 17వరకు జరుగనున్న సీపీఎం జిల్లా 3వ మహాసభల విజయవంతం కోసం అన్ని వర్గాల ప్రజలు విరాళాలు అందజేసి సహకరించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి వేముల భిక్షం అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ మహాసభల ప్రచార కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ ప్రజల పక్షాన నిలబడిన సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు రచ్చ గోవర్ధన్, గ్రామ శాఖ కార్యదర్శి రాచమల్ల సత్తయ్య, నాయకులు సత్యనారాయణరెడ్డి, మల్లేశం, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : మండలంలోని పటేల్ గూడెంలో సీపీఎం మహాసభల ప్రచార కరపత్రాలను ఆదివారం ఇంటింటా పంచి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దూపటి వెంకటేశ్, నాయకులు తులసయ్య, పిక్క గణేశ్, నిడిగొండ వాలీ, గ్యార భాస్కర్, లక్ష్మయ్య, అశోక్ పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : పటేల్‌గూడెంలో ఇంటింటా కరపత్రాలను పంచుతున్న నాయకులు